

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

ఆదివారం,23 నవంబర్ 2025

8 పేజీలు


# ఇల్లెక్కడ..?

- పీఎం యోజన కింద మళ్ళీ దరఖాస్తులు
- ఇప్పటికే జిల్లాలో 27 వేలకు పైగా నమోదు - వీటిలో 7 వేలే పరిశీలన
- కొత్తగా టిడ్కో ఆశలు -వచ్చే ఉగాది నాటికంటూ ఊరింపులు !



**ఏలూరు,సూర్యప్రతినిధి:** అర్హులైన పేదలందరికి సొంత ఇల్లు సమకూర్చేందుకు కూటమి ప్రభుత్వం నడుంకట్టింది. ఈమధ్యనే ఏలూరు జిల్లావ్యాప్తంగా సుమారు 15వేలకు పైగా ఇళ్లలో గృహప్రవేశం చేసేలా కార్యక్రమం నిర్వహించారు. దీనికి తోడు ప్రధానమంత్రి ఆవాసా యోజన కింద ఇళ్ళులేని పేదలకు కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే తమకు ఓఇల్లు కావాలంటూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలాల్లో వేలాది దరఖాస్తులు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎలాగూ తెలుపు రంగు రేషన్ కార్డు కలిగిన వారందరికీ సంక్షేమ కార్యక్రమం అమలు చేస్తూనే ఉంది. అయినప్పటికి సొంత ఇంటి కల నెరవేరాలని వేలాది మంది తాపత్రయ పడుతున్నారు.

**పిఎం అవాస యోజనకు భారీ డిమాండ్ –** జిల్లా వ్యాప్తంగా కొద్దీ రోజులనుంచి పేదల నుంచి దరఖాస్తుల స్వీకారణ ఆరభమైంది. వివిధ నియోజక వర్గాల నుంచి ఇప్పటికే ఏకంగా 29 వేల 187 దరఖాస్తులు వివిధసచివాలయంలో నమోదయ్యాయి. వీటిలో సుమారు 7వేల781 దరఖాస్తులు అధికారులు పరిశీలించారు. వాస్తవానికి ప్రతి దరఖాస్తు పరిశీలించడం, అర్హత ఉంటే నేరుగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన యాప్‌లో నమోదు చేయాలిసి ఉండగా ఈ ప్రక్రియ చాలా మండకొడిగా సాగుతోంది. చాలా నియోజకవర్గలలో ఇల్లు లేని వారంతా ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. ఆవాస్ యోజన కింద పట్టణ, గ్రామీణ కోటా కింద విడివిడిగా కేటాయిస్తారు. పట్టణ ప్రాంతాల్లో స్వంత గృహాలకు

- తరువాయి 2లో..

# ఐదేళ్లపాటు ఎక్కడ నిద్రపోయారు జగన్మోహన్ రెడ్డి ?

- కే.డబ్ల్యు డిటి 2నియామకానికి కారకులు మీరు కదా?
- చౌకబారు విమర్శలు తగవు అంటూ జగన్ లేఖపై ధ్వజం
- మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు



**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** దెయ్యాలు వేదాలు వల్లించడం, దొంగే దొంగదొంగ అని అరవడం మాదిరి రాష్ట్ర ప్రయోజనాలను తను దెబ్బకొట్టి కూటమి ప్రభుత్వంపై బురదచల్లడం విడ్డూరంగాను వింతగాను ఉందన్నారు .ఐదేళ్లపాటు అధికారమిస్తే.. అప్పుడు ఎక్కడ నిద్రపోయారు..జల వనరులపై మీరు ఇప్పుడు ప్రదర్శిస్తున్న కపట ప్రేమ అప్పుడు ఏమైపోయింది అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అతి కీలకమైన నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసింది మీరు కదా? రాష్ట్రజీవనాడి 'పోలవరం'తో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర నీటిపారుదల ప్రాజెక్టులన్నిటిని నిర్వీర్యం చేసి పడుకోపెట్టేసింది మీరు కాదా? అంటూ నిలదీశారు. ప్రస్తుతం మీరు వలకబోస్తోన్న జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని కృష్ణానది జల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ (కెడబ్ల్యు డిటి)-2 వేయడానికి, దాని అంకురార్పణకు మీచేతకానితనం కాదా అని నిలదీశారు. 2020లో అధికారంలోఉన్నది. మీరు, తెలంగాణకు కెసిఆర్. అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణఅప్పటి ముఖ్యమంత్రి కెసీఆర్ రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలు తుంగలో తొక్కి మన రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా మాట్లాడుతుంటే మీరు ఎపెక్స్ కౌన్సిల్లో నిద్రపోయారా అంటూ మంత్రి రామానాయుడు నిలదీశారు. అప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి వాదనల మేరకు కృష్ణా జలాల పంపిణీ పునర్విభజన చట్టం. దశాబ్దాల తరబడి ఉన్న ప్రాజెక్టుల ప్రాతిపదికన కాకుండా ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు, భవిష్యత్తులో నిర్మించబోయే ప్రాజెక్టులు ప్రాతిపదికన

- తరువాయి 2లో..

# విద్యార్థులకు అమ్మలా విద్యాబుద్ధులు నేర్పిన కలెక్టరమ్మ

- ప్రాథమిక విద్యే బలమైన పునాది
- ఒకరితో ఒకరు కొట్లాడుకోకూడదు
- విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసి జిల్లా కలెక్టర్ నాగరాణి





**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ పాలకొల్లులోని మహాత్మ జ్యోతిరావు పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మమేకమై కొంత సమయం వారికి పాఠాలను నేర్పించారు. ఎక్కడి నుంచి వచ్చారు,ఎలాచదువుకుంటున్నారు,వసతిఎలాఉంది,ఆహారం బాగుంటుందా తదితర ప్రశ్నలకు సమాధానాలను రాబట్టారు. ఈ సందర్భంలో కొందరు విద్యార్థులు జిల్లాకలెక్టర్‌తో మాట్లాడుతూ స్నానాలకు వినియోగించే నీటికారణంగా ఒళ్ళు దురదలు వస్తున్నాయని, తాగునీటిని ఎక్కువగా అందుబాటులోఉంచాలని తెలియజేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. భోజనానికి ముందు ప్రతిరోజు విద్యార్థులు ఆలపించే శ్లోకాన్ని జిల్లా కలెక్టర్ అనుకరించారు. ఈ సందర్భంలో విద్యార్థులతో ముచ్చటిస్తూ ప్రతిరోజు మెనూ ప్రకారం అందించే ఆహారాన్ని తప్పక తినాలని సూచించారు. మీకు ఏదైనా సమస్య

- తరువాయి 2లో..





# తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్టేషన్ వార్షిక తనిఖీలు

- తనిఖీలు నిర్వహించిన ఏలూరు రేంజ్ ఐజి జి.వి.జి.అశోక్ కుమార్

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జి.వి.జి.అశోక్‌కుమార్ శనివారం తాడేపల్లిగూడెం సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంతో పాటు తాడేపల్లిగూడెం రూరల్ పోలీసు స్టేషన్‌లలోవార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలో జిల్లాకు విచ్చేసిన ఐ.జి. అశోక్ కుమార్‌కి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మికి అధికారులు స్వాగతం పలికారు. సబ్ డివిజన్ పరిధిలో నమోదైన పలు కేసులను పరిశీలించి, దర్యాప్తు సరళిని అధికారులను అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. విధులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసుసిబ్బందిని రివార్డులకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల నియంత్రణలో గణనీయమైన పురోగతి సాధించామని, ప్రమాదాల సంఖ్య తగ్గిందని తెలిపారు. టోల్ గేట్లు, ముఖ్యమైన ప్రదేశాల వద్ద ప్రైవేట్ బస్సులు,లారీ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహిస్తూ, 'స్టాప్, వాష్ అండ్ గో' కార్యక్రమం ద్వారా డ్రైవర్లకు నిద్రమత్తు

- తరువాయి 2లో..

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఇన్,అవుట్ పేషెంట్లు, ప్రత్యేక విభాగాలలో సిసి కెమెరాలతో పటిష్ట నిఘా
- రోగులు,మెడికల్ కాలేజీ విద్యార్థులు ఫిర్యాదు చేస్తే విచారణ : కలెక్టర్ హెచ్చరిక





**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లాకలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబర్లో శనివారం ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్, మెడికల్ కాలేజీలో ఉన్న సమస్యలు,ప్రధాన ప్రభుత్వ హాస్పిటల్లో ఇటీవల వచ్చిన ఫిర్యాదులుపై పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని,తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అన్నారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వైద్యులు,సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని, హాస్పటల్‌కి వచ్చిన ఇన్ పేషెంట్లు,అవుట్ పేషెంట్లు పట్ల స్నేహ పూర్వక వాతావరణంలో వైద్యసేవలు అందించాలని అన్నారు. వారికి వైద్యం అందించుటలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతివార్డు,ప్రతివైద్య విభాగంను ఎప్పటికప్పుడు తనిఖీలు చెయ్యాలని,ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకోవాలని అన్నారు. అన్ని సీసీ కెమెరాలు

- తరువాయి 2లో..

# ఎన్ కౌంటర్లకు నిరసనగా న్యూ డెమోక్రసీ ర్యాలీ




ఏలూరు,మేజర్ న్యూస్ : కగార్ ఆపరేషన్ పేరుతో ఛత్తీస్ ఘడ్–జార?ండ్ ప్రాంతాన్ని కేంద్ర బలగాలు ఆక్రమించుకొని భారీ ఎత్తున ఎన్కౌంటర్లు చేస్తూ ఆదివాసీలను అంతమొందించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నాయకులు హిడ్మా ని,అతని సహచరి రాజే ని విజయవాడలో పట్టుకుని మారేడుమిల్లి అడవుల్లో కాల్చిచంపటాన్ని ఖండిస్తూ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి ర్యాలీగా బయలుదేరి పెద్ద వంతెన, బిర్లా భవన్ సెంటర్, చందన మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.వి, నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు లు మాట్లాడుతూ అడవిలోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పటానికే మోడీ –అమిత్‌షా ల ఫాసిస్టు ప్రభుత్వం కగార్ ఆపరేషన్ చేపట్టారని ఆరోపించారు. ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో ఖనిజ సంపద, నిధులు, నిక్షేపాలు ఉన్నాయన్నారు. తరతరాలుగా అటవీ ప్రాంతంలోనే అడవుల మీద ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలను అక్కడ లేకుండా చేయాలనే ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా మావోయిస్టులు,ఇతర విప్లవకారులు పోరాడుతున్నారనీ, అందుకే కేంద్ర ప్రభుత్వం విప్లవకారులను లేకుండా చేయాలని కుట్రతో ముందుకు సాగుతుందని విమర్శించారు. అదుపులోకి తీసుకున్న వారందరినీ వెంటనే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నగర నాయకులు ఎర్రా శ్రీనివాసరావు,పల్లి గంగరాజు,మంగం అప్పారావు,బగాది రమణ,ఇఫ్టూ నాయకులు నెహ్రూ బాబు,విజయలక్ష్మి, నాయుడు,నూకరాజు, రాము, అన్నవరం,లొట్ల సత్యనారాయణ,శ్రీను, దుర్గారావు, వీరబాబు,సూర్య నారాయణ,రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# పరువు నష్టం క్రిమినల్ దావాలో ప్రైవేటు వ్యక్తులకు, సివిఆర్ న్యూస్ ఛానల్‌కు కోర్టు నోటీసులు జారీ

ఏలూరు,మేజర్‌న్యూస్ : క్రిమినల్ పరువు నష్టం దావాలో సివిఆర్ న్యూస్ ఛానల్ యాజమాన్యం, ప్రైవేటు వ్యక్తుల పై పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం సీతారాంపురం శివారు రాజులపాలెంకు చెందిన చెరుకూరి సత్య వర ప్రసాదరాజు దాఖలు చేసిన కేసులో న్యాయమూర్తి కేసు ప్రాథమిక విచారణ జరిపి, వచ్చే డిసెంబర్ నెల 16వ తేదీకి వాయిదా వేశారు. ఫిర్యాది తరపున ఏలూరు కు చెందిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల న్యాయవాది గొట్టుముక్కల రోనాల్డ్ రాజు ఈ కేసులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ స్థలంలో ఓవర్ హెడ్ ట్యాంక్ కింద కొన్ని విగ్రహాలు ఏర్పాటు చేసి, సత్తెమ్మ గుడి నిర్మించి అక్కడి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ, ఇదేమని అడిగిన వారిపై దాడికి యత్నించారని, దేవుడు దేవతల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పలు కేసులకు సంబంధించి సుప్రీం కోర్ట్, ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులనేపథ్యం ఈఫిర్యాదులో పేర్కొన్నారు.మతాలకు అతీతంగా ప్రభుత్వ స్థలాలలో దేవాలయాలు, మసీదులు,చర్చిలు నిర్మించరాదని, నిర్మిస్తే వెంటనే తొలగించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని పలుమార్లు ఉన్నతస్థాయి కోర్టులు తీర్పులు ఇచ్చిన పరిస్థితులలో సీతారాంపురంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన సత్తెమ్మ గుడిని తొలగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒక మతం పై పిటిషనర్ చేసిన దాడిగా ప్రచారం చేసిన సివిఆర్ న్యూస్‌ఛానల్ స్థానిక విలేఖరి, హైదరాబాదు లోని ఛానల్ యాజమాన్యం పైన, ప్రైవేటు వ్యక్తుల పైన ఈ నెల 17వ తేదీన నర్సాపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రాథమిక విచారణ జరిగినట్లు తెలిపారు. తదుపరి విచారణ డిసెంబర్ 16వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారని పిటిషనర్ ప్రసాదరాజు వెల్లడించారు.

## తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీలు

మొదటిపేజీ తరువాయి

లేకుండా మోహం కడిగించడం వంటి భద్రతా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. గంజాయి అక్రమ రవాణా వినియోగంపై ముమ్మరంగా అణిచివేత చర్యలు కొనసాగుతున్నాయని, గత ఐదేళ్లలో గంజాయి నేరాలకు పాల్పడిన పాత నేరస్తులను పోలీస్ స్టేషన్లకు పిలిచి వారి కదలికలను నిరంతరం పరిశీలిస్తూ, పటిష్ట నిఘా ఉంచుతున్నామన్నారు. మహిళలు చిన్న పిల్లలపై నేరాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, నేరం జరిగిన వెంటనే త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి,ట్రయల్స్ వేగవంతంచేయడం ద్వారా నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ డి.విశ్వనాథ్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్,రవి కుమార్,రూరల్ పోలీసు స్టేషన్ ఎస్సై జె.వి.ఎన్ ప్రసాద్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మొదటిపేజీ తరువాయి

పీసీ పుటేజీని పరిశీలించి లోటుపాట్లు ఉంటే తక్షణం చర్యలు తీసుకోవాలని,ఉదాసీనత ప్రదర్శిస్తే సమస్యలు జఠిలం అవుతాయని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.జె.అమృతం,డిసిహెచ్ యస్ డా. బి.పాల్ సతీష్ కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.పి.సావిత్రి, జిల్లా ప్రధాన ప్రభుత్వఆసుపత్రి సూపర్డెంటు డా.యం.యస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన విజయవంతం చేయండి

– శాసనసభ్యులు చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని శాసనసభ్యులు చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ సోమవారం ద్వారక తిరుమల మండలం ఐ.యస్ జగన్నాథపురం గ్రామానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. ఈ పర్యటన విజయవంతం కావడానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి చిర్రి బాలరాజు స్వయంగా పర్యవేక్షించారు. హెలిపాడ్ ప్రాంతం, రూట్ మ్యాప్, ప్రజల కోసం అవసరమైన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు బిజెపి టిడిపి జనసేన కూటమి నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# ఇల్లెక్కడ..?

మొదటిపేజీ తరువాయి

భారీ డిమాండ్ ఉంది. ఇంతకుముందు జగన్ జమానాలో ఒక్క ఏలూరు నగరవాసులకు స్వంత ఇల్లు సమకూర్చాలన్న లక్ష్యం లో భాగంగా ఏకంగా ఏలూరుపరిధిలో33 వేల మందికి ఇంటి స్థలంసమకూర్చారు. వ కోమడవోలు, పోనంగి, ఇందిరానగర్, చోదిమిళ్ళ శివారులో వేసిన లే–అవుట్‌లలో కొంతమంది మాత్రమే ఇళ్ళు నిర్మించేందుకు ముందుకు వచ్చారు. తొలి దఫలో ఇప్పటికే గృహప్రవేశాలు కూడా జరిగాయి. అయితే ఇంకా పేదలు చాలా మంది ఇళ్ల నిర్మాణం అవకాశం రాక దిక్కులు చూస్తున్నారు. ఇలా స్థలం ఉండి. ఇల్లు లేకపోతే అటువంటి వారందరికీ ఇప్పుడు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు సమకూరుస్తారు. అందుకే దరఖాస్తులు కోసం పదే పదే పిలుపు ఇస్తున్నారు. ఇంకోవైపు వచ్చిన దరఖాస్తులు యాప్‌లో నమోదు చేయటం దగ్గర నుంచి ఆన్లైన్ చేయాల్సి ఉండగా నెమ్మదిగా ఈ ప్రక్రియ సాగుతోంది. ఊహించని విధంగా వేలాది దరఖాస్తులు అందటం ఇంకా ఆఖరి గడువు ఈ నెలాఖరు వరకు ఉండటంతో జిల్లాలో ఎంత మందికి స్వంత ఇంటి అవకాశం ఇస్తారో చూడాలి.

**– మళ్ళీ కొత్త ఆశలు –** తాజాగా టిడ్కో ఇళ్ల దగ్గర నుంచి మిగిలిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి వచ్చే ఉగాది నాటికీ పెద్ద ఎత్తున గృహ ప్రవేశాలు జరిగేలా తక్షణ చర్యలు కు దిగాలని సీఎం చంద్రబాబు తాజాగా అధికారులను ఆదేశించారు. వాస్త వానికి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల ను పేదల పరం చేస్తామంటూ నాలుగు సార్లు వివిధ సమీక్ష లలో ప్రకటించిన అది మాత్రం జరగలేదు. మళ్ళీ తాజా నిర్ణయం అమలు చేస్తారా లేదా అన్నది చూడాలి. ఇంకోవైపు పట్టణ ప్రాం తంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు చొప్పునస్థలంఇస్తామనిప్రకటించినఇప్పటిదాకాఅదీ నెరవేరలేదు.

## ఐదేళ్లపాటు ఎక్కడ నిద్రపోయారు జగన్మోహన్ రెడ్డి ?

మొదటిపేజీ తరువాయి

జరగాలని కోరినప్పుడు ఎందుకు అభ్యంతరం చెప్పలేదు, ఎందుకు మౌనం దాల్చారు అంటూ రామానాయుడుసూటిగా ప్రశ్నించా రు. ఈనేపథ్యంలోనే కేడబ్ల్యుడిటీ–2ఏర్పాటు అయింది అన్నారు.పోనీ తర్వాత అయినా స్పందించారా అంటే అది లేదు. 2023లో కేంద్ర క్యాబినెట్ ఆమోదించి గెజిట్ నోటిఫికేషన్ కి సిద్ధపడిన వేళ కూడా తమరు నోరు మెదపలేదని ఎద్దేవా చేశా ్ర.రాష్ట్ర చరిత్రలో రాయలసీమకు ఏ ముఖ్యమంత్రి చేయ నంత ద్రోహం తజగన్ చేశాడని మంత్రిరామానాయుడు విమ ర్శిం చారు.రాజకీయంగా మసకబారిపోయిన పార్టీని కాపాడు కోవడానికి,ఉనికినిచాటుకోవడానికి చౌకబారు విమర్శలు చేయడం,లేఖలు రాయడం జగన్మోహన్ రెడ్డి పలాయన వాదాన్ని సూచిస్తోందని అన్నారు.రాష్ట్ర ప్రయోజ నాలను దెబ్బతీసిన జగన్ క్షమాపణ చెప్పాలని మంత్రి రామానాయుడు డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు అమ్మలా విద్యాబుద్ధులు నేర్పిన కలెక్టరమ్మ

మొదటిపేజీ తరువాయి

ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ ప్రాథమిక విద్య పునాది వంటిదని,ఏ వృత్తి చేపట్టాలన్న ప్రాథమిక విద్య చాలా ముఖ్యమన్నారు. ఏడు నుండి తొమ్మిది తరగతి వరకు ప్రతి పాఠ్య పుస్తకాన్ని శ్రద్ధ చదివితే పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవుతారని, భవిష్యత్తులో కూడా ప్రాథమిక విద్య పునాదిగా ఉంటుందన్నారు. పిల్లలు ఒకరికి ఒకరు చదువులో తోడుగా ఉండాలని,సరిగ్గా చదువలేని, ఉచ్చరించలేని వారిని గేలి చేయకుండా వారికి మీకు వచ్చినది నేర్పించాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని అనుకున్న లక్ష్యాల ను చేరుకోవాలన్నారు. ఎల్లప్పుడు ధైర్యంగా ముందడుగు వేయాలన్నారు. క్రమశిక్షణ చాలా ముఖ్యమని,ప్రతి దినం పాఠాలను చదివి పూర్తి చేయాలన్నారు. చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని తెలిపారు.తల్లిదండ్రులను, ఉపాధ్యాయుల ను ఎన్నటికీ మర్చిపోకూడదని, అలాగే మీ స్నేహ భావాన్ని కూడా విడనాడకూడదని హితవు పలికారు.ఈ సందర్భంలో డిఇఓ ఇ.నారాయణ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సూరిబాబు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జి.సూర్య కుమారి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ పి.శ్రీదేవి, డిప్యూటీ వార్డెన్ కే.ప్రవీణ్, ఎంఈఓ ఆర్ ఎమ్ ఎన్ వి ఎస్ జి శర్మ, తహసిల్దార్ వై.దుర్గా కిషోర్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

# మన్యం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి




– సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు రాఘవ డిమాండ్

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** ఎన్‌కౌంటర్లను ఖండిస్తూ అరెస్ట్ చేసిన మావోయిస్టులు అందరిని వెంటనే కోర్టుకు హాజరపరచాలని డిమాండ్ చేస్తూ జంగారెడ్డిగూడెంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది విక్రమ్ భవనం నుండి ప్రదర్శన బోసు బొమ్మ సెంటర్ బస్టాండ్ మీదుగా కొనసాగింది అనంతరం జరిగిన సభకు కెవి రమణ అధ్యక్షత వహించగా కారం రాఘవ మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్లపై పలు అనుమానాలు ఉన్నాయని వైద్యం కోసం వచ్చిన వారిని పట్టుకుని ఎన్కౌంటర్ చేశారని ఆ పార్టీ ప్రకటించిందని అన్నారు. న్యాయమూర్తితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని రాఘవ డిమాండ్ చేశారు. విజయవాడ ఏలూరు కాకినాడ కృష్ణా జిల్లాలలో 50 మంది వరకు మావోయిస్టులు వారి సానుభూతిపరులను పోలీసులు అరెస్ట్ చేశారు అని వారే కాకుండా ఆ పార్టీ అగ్ర నాయకులు అరెస్ట్ అయినట్లుగా తెలుస్తుందని వారిని వెంటనే కోర్టులో హాజరపరచాలని డిమాండ్ చేశారు. జరిగిన రెండు ఎన్కౌంటర్లు అనుమానస్పదంగా ఉన్నాయని వాటిపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని ప్రస్తుత న్యాయమూర్తి చే విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సభలో తగరం బాబురావు కెచ్చేల పోతురేడ్డి పిడిఎస్‌యు నాయకులు ఈ భూషణం పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే లత కారం లక్ష్మి కట్టం నాగేశ్వరరావు అరుణోదయ నాయకుడు నడపల ముక్కారెడ్డి కె ప్రతాప్ రెడ్డి తదితరులు మాట్లాడారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొని ద్విచక్ర వాహన దారుడు మృతి



**ఏలూరు,మేజర్ న్యూస్:** ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహన దారుడు ఢీకొనడంతో అతను ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటన ఏలూరు జాతీయ రహదారిలోని 3వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దుగ్గిరాల సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు మృతుడి వివరాలు సేకరిస్తున్నారు.

## బిఆర్ఎంవి,ఎంపిఎల్ హై స్కూల్‌లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక బిఆర్ఎంవి,ఎంపిఎల్ హై స్కూల్ నందు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం శనివారం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి గుమ్మళ్ళ వీరస్వామి శర్మ పర్యవేక్షణలో ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విద్యార్థుల లాంగ్ ఆబ్సెంట్ ను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చే ఏర్పాటు చేయవలసిందిగా ఎస్ఏ వన్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థిని గుర్తించి వారికి రెమిడీయల్ టీచింగ్ ఇవ్వాల్సిందిగా కోరారు.

ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్, సిలబస్ కంప్లీట్ చేయవలసిందిగా ఉపాధ్యాయులచే మోడల్ లెసన్స్,అభ్యసన సామర్థ్యాలు సాధించడానికి వ్యూహాలు, అలాగే డిసెంబర్ ఐదో తారీఖున నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్ అత్యంత వైభవంగా నిర్వహించడం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కాంప్లెక్స్ హెచ్ఎం ఝాన్సీ లక్ష్మీబాయి. సెక్రటరీ రాయపూడి భవానీ ప్రసాద్. ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

## విద్యార్థిని కావ్య మృతదేహానికి పోస్టు మార్టం



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** జంగారెడ్డిగూడెంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని కావ్య మృతదేహానికి శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో పోస్టు మార్టం జరిగింది.

కావ్య నిన్న గురుకుల పాఠశాలలో ఉరేసుకొని చనిపోయింది. దీనిపై పోలీసు అధికారులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి విస్తృతంగా దర్యాప్తు నిర్వహించారు. శనివారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో రెవెన్యూ,పోలీస్ అధికారులతో కావ్య కుటుంబ సభ్యులు చర్చలు జరిగిన తరువారు ఆ బాలిక మృతదేహానికి పోస్ట్ మార్టం కుటుంబ సభ్యులు,పోలీసుల సమక్షంలో జరిగింది.

ఇదిలా ఉండగా గురుకుల పాఠశాల విద్యార్థిని కావ్య మృతి చెంది రెండు రోజులైనా ఈనాటికీ న్యాయం జరగలేదని ఆరోపిస్తూ శనివారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆమె కుటుంబ సభ్యులు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు ఆందోళన చేపట్టారు.

అధికారుల నిర్లక్ష్యం అంటూ నినాదాలు చేశారు. పోలీస్ అధికారులు కావ్యా మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

# మానసిక రోగులను రక్షించే సేవలు అభినందనీయం



**భీమవరం,మేజర్ న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా శాఖ,మనోబంధు ఫౌండేషన్ సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా తిరుగుతూ ఉన్న మానసిక రోగులను రక్షించడం, పునరుద్ధరించడం, కుటుంబాలతో మళ్లీ కలపడాన్ని లక్ష్యంగా పెట్టుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని 22 నుండి 24 నవంబర్ 2025 వరకు అన్ని మున్సిపాలిటీల్లో ప్రారంభించాయి. ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్ ,జిల్లా మేజిస్ట్రేట్ సి.నాగరాణి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డా.భద్రి రాజు ఎం.ఎస్.వి.ఎస్, మనోబంధు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బి.ఆర్.కే. రాజు, రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ వబిలిసెట్టి కనకరాజు, మేనేజింగ్ కమిటీ సభ్యుడు జి.కృష్ణరావు, అలాగే రెడ్‌క్రాస్, మనోబంధు ఫౌండేషన్ సిబ్బంది మల్లేశ్వర రావు, ఆచార్యులు,సురేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఈ డ్రైవ్ కోసం ప్రత్యేక మొబైల్ వాహనాన్ని కలెక్టర్ ఫ్లాగ్ ఆఫ్ చేసి,తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించడం, రక్షించడం ,సురక్షితంగా తరలించేందుకు పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, సమన్వయంతో పనిచేస్తూ ఇలాంటి వర్గాలను కరుణతో,గౌరవంతో రక్షించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో సహాయం అవసరమైన మానసిక రోగులను గుర్తించి హెల్ప్‌లైన్ 9246568738 నంబరుకు సమాచారం ఇవ్వాలని రెడ్‌క్రాస్ విజ్ఞప్తి చేసింది.

## గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థుల 'ప్రతిభ '



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శాఖా గ్రంథాలయం జంగారెడ్డిగూడెంలో జరిగిన వివిధ పోటీలలో అత్యధికంగా బహుమతులు గెలుచుకున్న ప్రతిభ విద్యార్థులను అభినందించిన యాజమాన్యం. వ్యాసరచనలో రెండు బహుమతులు వక్తృత్వపోటీల్లో2 బహుమతులు, చదరంగంలో 5 బహుమతులు, చిత్రలేఖనంలో 2బహుమతులు, క్విజ్‌లో ప్రథమ,తృతీయ లెమన్ అండ్ స్పూన్‌లో ఒక బహుమతి ఈ విధంగా అన్ని విభాగాల్లోనూ తమ ప్రతిభా పాటవాలను చూపించారని అన్నారు. విజేతలుగా నిలిచిన ప్రతిభ పాఠశాల విద్యార్థులను ప్రతిభలో జరిగిన అభినందన సభలో డైరెక్టర్స్ సత్యనారాయణ రెడ్డి సుభాష్ రెడ్డి అకడమిక్ డైరెక్టర్ సింధుషారెడ్డి ,ప్రిన్సిపాల్ సరోజా రెడ్డి అభినందించారు.

## కొప్పర్రులో ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయమునకు అనుబంధంగా ఉన్న కొప్పర్రుపుస్తక పంపిణీ కేంద్రం లో గ్రంథాలయ కమిటీ గోపాలకృష్ణ గోకలే,పోలిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో గ్రేడ్ వన్ లైబ్రరీయన్ కేజే ఎస్ ఎల్ కుమారీపాల్గొని గ్రంథాలయ వారోత్సవాల ప్రాధాన్యతను విశిష్టతను పిల్లలకు వివరించి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. శనివారం ఎంపీపీ స్కూల్ కొప్పర్రు మెయిన్ లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఉప్పు గంటి రాజశ్రీ పుస్తక ప్రదర్శన లో సాహిత్య అకాడమీ బహుమతి పొందిన రచనలు వంద ఏళ్ల తెలుగు కథ జాతీయకథలు వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు 30 మంది రచయితల పుస్తకాలు పరిచయంజాతీయ నాయకులఫోటోలు ప్రదర్శన ను గురించి వివరించారు. ఈ పుస్తక ప్రదర్శన పిల్లలకు ఎంతో. విజ్ఞాన దాయాకం గా ఉంది. పుస్తక పంపిణీ కేంద్రమునకు నర్సాపురం రీడర్స్ ఫారం వారు సాహిత్యా పుస్తకాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలోకొప్పర్రు పుస్తక పంపిణీ కేంద్రం నిర్వాహకులు కమల కుమారి,రీడర్స్ ఫారం సుధీర్ మోహన్ సాఫ్ట్ లైన్ కంప్యూటర్స్, సూర్యం బాబు డాక్టర్ ఆరేటి అమ్మాజీ, భట్టిప్రోలు సత్యనారాయణ, చిన మిల్లి వీరబాబుకొప్పరు గ్రామ పెద్దలు టీచర్లు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కాలేజ్ అభివృద్ధికి దాతల సహకారం ప్రశంసనీయం



**కామవరపుకోట ,మేజర్‌న్యూస్:** స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం శుభ పరిణామం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఆడమిల్లి గ్రామానికి చెందిన కళాశాల అభివృద్ధి కమిటీ మెంబర్ జుజ్జూరి బాబ్జి, కళాశాల సిపిడిసి సెక్రెటరీ అండ్ స్థానిక సర్పంచ్ గూడపాటి కేశవరావుతో కలిసి శనివారం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ అందజేశారు. కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు స్పోర్ట్స్ కిట్ అందించిన బాబ్జిని అభినందించారు. కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు, అధ్యాపకులు ఎం ఉషారాణి, కె ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, బి రాజు, ఎం విజయ కృష్ణ, సిబ్బంది కుమార్ రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఏలూరు జిల్లాగా రూపొందించేందుకు కృషి చేయాలి

**- సామాజిక మరుగుదొడ్లు నిర్మాణాలపై ప్రతిపాదనలు అందించాలి**

**- అధికారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లాని స్వచ్ఛఏలూరు జిల్లాగా రూపొందిం చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో పారిశుధ్యం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ,తదితర అంశాలపై జిల్లాఅధికారులు, ఎంపీడీవోలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు.జిల్లాలో ఎక్కడ బహిరంగ మలవిసర్జన జరగకుండా చూడాలని, ప్రతీ ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్నీ మండలాల్లో అవసరమైన సామాజిక మరుగుదొడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలను సోమవారం సాయంత్రం నాటికి పంపాలన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా ఈరోజుకారోజు సేకరించిన చెత్తని తడి, పొడి చెత్తల కింద విభజించి డంపింగ్‌యార్డ్‌కి తరలించాలన్నారు. కొబ్బరి, ప్లాస్టిక్‌వ్యర్థాలను సాంప్రదాయ రీతిలో నిర్వహణపై ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలన్నారు. శ్రీ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలు రైపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడానికి అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టి.నర్సాపురం,నూజవీడు ప్రాంతాలకు ప్లాస్టిక్ సక్షన్ పాయింట్లకు ఇప్పటికే మంజూరు ఉన్న నేపథ్యంలో, సంబంధిత అధికారులు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ,శ్రీహరి జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఎంపిడిఓ, పాల్గొన్నారు.

## మొక్కజొన్న విత్తన పంట బకాయిలు వెంటనే ఇప్పించాలి

**- 4వ రోజుకు చేరిన మొక్కజొన్న విత్తన రైతుల రిలే దీక్షలు**




**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ నుండి డబ్బులు వెంటనే ఇప్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పంగిడిగూడెం శివారు హనుమాన్ గూడెంలో బాధిత మొక్కజొన్న రైతులు శనివారం 4వ రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. మాకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం శివారు హనుమాన్ గూడెం గ్రామంలో మొక్కజొన్న రైతులు సీడ్ ఆర్గనైజర్ చేతిలో మోసపోయారని వారికి న్యాయం చేయాలని కోరారు.

కంపెనీల పేరు లేకుండా స్థానికంగా కొంతమంది మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్లు విత్తనాలు అమ్ముతూ అమాయకులైన కొందరు రైతులను మోసగిస్తున్నారని స్థానిక వ్యవసాయ అధికారులకు వీటి పట్ల ఎలాంటి నియంత్రణ లేదని దాంతో రైతులు తీవ్రంగా మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులు వీరవల్లి శివ నాగరాజు, వీరవల్లి మోహనరావు, వీరవల్లి వీర వెంకట్రావు, గుర్రం పాపారావు, వీరవల్లి నాగేంద్రరావు, వీరవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధిని ముందస్తుగా గుర్తించి చికిత్స తీసుకోవాలి



**భీమడోలు,మేజర్ న్యూస్:** కుష్టువ్యాధిని ముందస్తుగా గుర్తించి, తగు చికిత్స తీసుకుంటే, ఆరోగ్య వంతులుగా కొనసాగడంతో పాటు, అంగవైకల్యం బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని, కుష్టు, ఎయిడ్స్,టిబి. జిల్లా అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ మేరకు వివిధ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఆశాలు కుష్టు వ్యాధిని ప్రాథమికంగా గుర్తించే సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జాహ్నవి రెడ్డి, డాక్టర్ శరణ్య, అధికారి మధుసూదనరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న సర్వే కార్యక్రమాన్ని జిల్లా అధికారి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు ఇందిర, రామకృష్ణ పాల్గొన్నారు.

## నేడు తాడువాయిలో కె 9 ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**- అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్,కృష్ణం రాజు వెల్లడి**

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** ఇచ్చిన మాట వేసిన అడుగు వెనక్కు తీసుకోని భృహత్ లక్ష్యం తో 'కష్టం వస్తే కాపు కాస్తాం 'అనే నినాదం తో ముందుకు వెళుతున్న కె 9కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడో మెడికల్ క్యాంపు 23వ తేదీ ఆదివారం తాడువాయిలో ఏర్పాటు చేస్తున్నట్టు కె 9 అధ్యక్ష,కార్యదర్శులు తొమ్మిదేళ్ల శ్రీనివాస్,శీలం కృష్ణం రాజు తెలిపారు. కె 9,వైద్య విభాగం అధ్యక్షులు స్థానిక ప్రముఖ హాస్పిటల్ శివ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్. దుట్టా శివ శంకరరావు నేత్రత్వంలో మెడికల్ క్యాంప్ జరిగనుందని పేర్కొన్నారు.తాడువాయి గ్రామ పంచాయతీ కార్యా లయం లో జరగనున్న మెడికల్ క్యాంపులో సాధారణ పరీక్షలతో పాటు కిడ్నీ లో స్టోన్స్ గురించి కూడా పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వివరించారు.బిపి, షుగర్ పెషేంట్లకు మందులు కూడా ఫ్రీగా ఇస్తారని తెలిపారు. తాడువాయి పంచాయతీ పరిధిలో ని గ్రామాలు, సమీపంలో ని గ్రామాలవారు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పెనుగొండ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు

**- విజిబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలి**

**- ప్రజలతో మర్యాదగా మెలగాలి** : డిఎస్పి డాక్టర్ శ్రీ వేద



పెనుగొండ, మేజర్ న్యూస్: పెనుగొండ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం సబ్ డివిజన్ డి.ఎస్.పి డాక్టర్ శ్రీ వేద సందర్శించారు.పెనుగొండ పోలీస్ స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించి, సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు.పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల ఫైళ్లనుపరిశీలించి, పెండింగ్ కేసుల స్థితిగతులు,దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు.దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్‌ల పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, కఠినంగాకేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అపహరించబడ్డ ప్రాపర్టీ కేసులను త్వరితగతిన ఛేదించి, రికవరీ శాతాన్ని పెంచాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి వాటి మోటరింగ్ ను చూసే విధంగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు 'విజిబుల్ పోలీసింగ్' (గస్తీ)పై దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రజలతోమర్యాదగా మెలగాలని సిబ్బందికి సూచించారు .సైబర్ నేరాలు, మహిళల చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌లో ఉన్న ప్రోపర్టీని (వాహనాలు) త్వరితగతిన వేలం వేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీతో పాటు ఎస్సై గంగాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మ్యాజిక్ డ్రైన్లు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే మద్దిపాటి



**ద్వారక తిరుమల,మేజర్ న్యూస్:** మండలం లోని ఐ యస్ జగన్నాధపురం గ్రామం లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణంలో ఉన్న మ్యాజిక్ డ్రైన్లలను శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు పరిశీలించారు. త్వరితగతిన ఈ డ్రైన్ల నిర్మాణం పూర్తిచేయాలని,24వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వీటిని ప్రారంభిస్తారని మద్దిపాటి అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

## వ్యాస రచన పోటీలో మొదటి బహుమతి సాధించిన జోసఫ్ దంత కళాశాల విద్యార్థిని



పెదవేగి, మేజర్ న్యూస్: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవముల సందర్భంగా, బ్రహ్మకుమరిన్ నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో డా.టి బిందు పార్వతి హౌస్ సర్జన్ కి మొదటి బహుమానం సాధించింది. ఈ పోటీలు పౌరగ్రంథాలయ శాల శాఖ, ఉమ్మడి ప.గో. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ఏలూరు నందు బ్రహ్మకుమారిస్ సెంటర్ హెడ్ బి.కె. లావణ్య బహుమతిని అందచేశారు. సమయ నిర్వహణ, క్రమశిక్షణ ఆవశ్యకత గురించి వ్యాసం వ్రాయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినిని సెక్రెటరీ, కరస్పాండెంట్ ఫాదర్. మోజెస్ , అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, ప్రిన్సిపల్ డా. ఎన్. స్లీవ రాజు, హెడ్ ఆఫ్ ద డిపార్టెమెంట్, పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్ డా.ఎమె. పావన సంధ్య. అభినందించారు.

## 26న జంగారెడ్డిగూడెం సూర్య డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో సూర్య డిగ్రీ కాలేజ్ జంగారెడ్డిగూడెం నందు ఈనెల 26వ తేదీ బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళా కరపత్రాన్ని ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆవిష్కరించారు.ఈ జాబ్ ఫెయిర్ నందు 17కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని,అలాగే సుమారు 1,140 మందికి పైగా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు పదో తరగతి,ఇంటర్, ఐటిఐ,డిగ్రీ వంటి విద్యార్థులు 18 –35 మధ్య వయసు గలవారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 96525 03799,96663 22032, కమాండ్ కంట్రోల్ నెంబర్స్ 99888 53335, 87126 55686,87901 18349,87901 17279 సంప్రదించాలని తెలిపారు.ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా,సర్టిఫికెట్స్ జిరాక్స్ లతో హాజరుకావాలని ఎమ్మెల్యే వారి కార్యాలయం వారు తెలిపారు.

# ఎమ్మెల్యే రోషన్ కుమార్ తో జడ్పీ హైస్కూల్ విద్యార్థినిలు





**– జాతీయ చిత్రలేఖన పోటీలకు ఎంపికైన జాహ్నవికి అభినందనలు**

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** థర్మల్ పవర్ కార్పొరేషన్ ఎండిపిసి ఆధ్వర్యంలో ఉత్తమ విద్యుత్ సామర్థ్యం అనే అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపికైన కాసరపు జాహ్నవిని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించి ఆర్థిక సహాయం చేశారు. లక్కవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని జాహ్నవి బహుమతిని గెలుచుకొని న్యూఢిల్లీలో జరుగుతున్న జాతీయ స్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎంపిక కావడంతో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు దుర్గారావు విద్యార్థిని డ్రాయింగ్ లో సాధించిన ఘనతను ఎమ్మెల్యే రోషన్ కు వివరించారు. అలాగే 2019లో జడ్పీ హైస్కూల్ లో చదువుకుంటున్న విద్యార్థిని బాసి సంధ్యకు చదువుకోవడానికి ప్రస్తుత చింతలపూడి ఎమ్మెల్యే మిషన్ హోప్ సంస్థ ద్వారా ఎంతోమందిని ఆదుకుంటూ అదే సమయంలో లక్కవరం గ్రామానికి చెందిన సంధ్యకు ఆన్లైన్ ద్వారా అమెరికా నుంచి వారి కుటుంబానికి రూ. 5వేలు సహాయం చేయడం జరిగింది. అప్పుడు చేసిన సహాయంతో ఇప్పటికీ గుర్తు పెట్టుకుని అప్పుడు డ్రాయింగ్ పోటీల్లో నెంబర్ వన్ స్థానంలో ఉన్న విద్యార్థిని ఎమ్మెల్యేను కలుసుకొని మీరు నాకు 2019లో చేసిన సహాయం అక్కడితో ఆగిపోకుండా మరింత ఉన్నత చదువులు చదువుకోవడానికి ఉపయోగించుకున్నానని ఎమ్మెల్యే దగ్గర ఆనందాన్ని వ్యక్తం చేసింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థులకు మరింత ప్రోత్సాహం ప్రకటిస్తూ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హై స్కూల్ డ్రాయింగ్ టీచర్ మనోహర్ ఎమ్మెల్యే చిత్రపటాన్ని డ్రాయింగ్ వేసి ఆయనకు బహుకరించారు. డ్రాయింగ్‌లో ఘనత సాధిస్తున్న విద్యార్థులకు మరోసారి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ దల్లి దుర్గారెడ్డి తోపాటు టిడిపిసోషల్‌మీడియా కొదమ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# కూలిన ‘కోట’ గ్రంథాలయంపై కప్పు – భయాందోళనలో పాఠకులు

**కామవరపుకోట,మేజర్‌న్యూస్:** స్థానిక ప్రభుత్వ శాఖా గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొద్ది నెలల నుంచి పై కప్పు, పెంకులు కూలుతున్నాయి. వర్షాలకు ఇప్పటికే లోపల విలువైన పుస్తకాలతో పాటు ఫర్నిచర్ సైతం దెబ్బతింటోంది. తాజాగా శుక్రవారం రాత్రి ఒక్కసారిగా పై కప్పు కూలి పెంకులు లోపల పడిపోయాయి. దీంతో విలువైన పుస్తకాలతో పాటు ఫర్నీచర్ కొంత వరకు దెబ్బతింది. ఇప్పటికే గ్రంథ పాలకులు, స్థానికులు టర్పాలిన్ కవర్లను పై కప్పుకు వేసి పుస్తకాలను కాపాడుతున్నా ఎప్పుడు ఏం జరుగుతుందో ? అన్న భయాందోళనలో



స్థానికులు ఉన్నారు. ప్రతి రోజు 100 మంది వరకు ఇక్కడకు వచ్చి పుస్తకాలు, పత్రికలు చదువుతూ ఉంటారు. లోపల పాఠకులు ఉన్నప్పుడు జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కొన్ని ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నాయి. అక్కడకు గ్రంథాలయాన్ని మార్చాలని పాఠకులు, పట్టణ ప్రజలు కోరుతున్నా కనీసం ఆ దిశగా కూడా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ఈ విషయంలో స్పందించి గ్రంథాలయాన్ని వేరే చోటకు మార్చాలని కోరుతున్నారు.

# టిడ్కో గృహాలే నా తొలి ప్రాధాన్యత





**– అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి రామానాయుడు**

**పాలకొల్లు ,మేజర్ న్యూస్ :** పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పేదలు, మహిళల సొంతింటి కల టిడ్కో గృహాలే నా తొలి ప్రాధాన్యతని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు తెలిపారు. పట్టణంలో కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. స్వయంగా మోటార్ సైకిల్ నడుపుతూ అధికారులు, కూటమి నాయకులతో కలిసి తిరిగారు. ఆయా పనులు పై అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పేదల సొంతింటి కల తీర్చేలా టిడ్కో గృహాల పనులపై ప్రత్యేక దృష్టి సాధించానని అందులో భాగంగా కొద్దిపాటి అసంపూర్తిగా నిలిచిన గృహాలను పూర్తి చేసి అందజేయడం జరుగుతుందన్నారు. టిడిపి ప్రభుత్వంలో పాలకొల్లు ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రికి 12.60 కోట్లు మంజూరు అయితే దురదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లలో పూర్తికాకపోగా జరిగిన కొద్దిపాటి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా జరిగాయి అన్నారు. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ భవనం, గౌడ శెట్టిబలిజ భవనం, ముస్లిం షాదీఖానా, క్రిస్టియన్ బర్రెల గ్రౌండ్, అబ్దుల్ కలాం పార్క్,రామగుండం ఉద్యానవనం వంటి పనులు వేగవంతంగా జరుగు తున్నాయన్నారు. ఈపర్యటనలో మున్సిపల్ కమిషనర్ విజయ సారథి,కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు,గండేటి వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల కబర్ధి,బోనం నరసయ్య ధనాన్ని సూర్య ప్రకాష్ అల్లంతాతాజి మహమ్మద్ జానీ వల్లభ శ్రీనివాస్ మండల రాంప్రసాద్ కిలారి రామారావు ముప్పిరి సత్యనారాయణ కొల్లు ఉదయ పవన్ మండాది అవినాష్ బందెల భాస్కరరావు మామిడి శెట్టి పెద్దిరాజు ముట్టబత్తుల దొరబాబు మల్లంపల్లి పకీర్ బాబు అంగర చిన్న పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కార్యకర్త మధు కుటుంబానికి ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ



**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ కార్యకర్తలకు చేదోడుగా ఉంటూ అన్ని విషయాలను సహాయ సహకారాలను అందజేస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కొయ్యలగూడె మండలం జనసేన పార్టీ కార్యకర్త చెప్పుల మధు తల్లి చెప్పుల కృపమ్మ ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న శాసనసభ్యులు శనివారం మధు ఇంటిని సందర్శించి మాట్లాడి భరోసా కల్పిస్తూ మనోధర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మధు కుటుంబ పెద్దను కోల్పోవడం దురదృష్టకరమని కుటుంబీకులు గుండె నిబ్బరంతో ఉండాలని అన్నారు. ఎల్లప్పుడు తోడుగా ఉంటూఎల్లవేళలా సహాయసహకారాలు అందజేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు తోట రవి పట్టణ అధ్యక్షులు మాదేపల్లి శ్రీను వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు దుగ్గిన శ్రీనివాస్,చోడి పిండి సుబ్రహ్మణ్యం ,మట్ట సత్యనారాయణ. మేడిన్ కన్నయ్య,నక్క బాబి, సాయి మట్ట శీను, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## డీప్యూటీ సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మద్దిపాటి



**ద్వారకతిరుమల ,మేజర్ న్యూస్:** ఈ నెల 24తేదీన మండలంలోని మండలం ఐయస్ జగన్నాధపురం లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం వద్ద జరుగు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను హెలిప్యాడ్‌నిర్మాణాన్ని,భద్రత చర్యలను శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎయమ్‌సి వైస్ చైర్మన్ పోతనధర్మరాజు నియోజకవర్గ జనసేనఇంచార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, దాకారపు నరసింహమూర్తి, మట్టపర్తి రూపేష్‌కుమార్,ముత్తింటి సత్యనారాయణ, అద్దంకి రామచంద్రశేఖర్, అక్కిశెట్టి సుధాకర్,ఇమ్మడి రత్నాజీ, గువ్వల మావుళ్ళ రావు,రేగంటి వెంకటేశ్వర రావు,జిలుగుల సిద్ధారావు,పల్లి రాంబాబు,అధ్యక్షులు ఏపూరి కిషోర్, బొట్ల సాయి, దేవస్థానం, పోలీస్, మండల పరిషత్ అధికారులు,మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మాలల ఆత్మీయ సమావేశానికి హర్ష కుమార్,సూర్యారావుకు ఆహ్వానం



**అమలాపురం /నర్సాపురం,మేజర్ న్యూస్ :** ఈనెల 29న మండలంలోని సీతారాంపురంలో గల జేబీరా విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించే మాలల ఆత్మీయ సమావేశానికి ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం మాజీ ఎంపీజీవి హర్ష కుమార్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావు లకు ఆహ్వాన పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది సోడదాశి శ్రీధర్ సూర్య ప్రతినిధితో మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గం లోని మాలలందరూ కుటుంబ సమేతంగా తరలి రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. వీరితో పాటు తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలోని మాల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధనపు యేసు రత్నం,ఆడిదల శరత్,జయ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ నగరంలో తాగునీటి సమస్యకు పరిష్కారం



**భీమడోలు ,మేజర్ న్యూస్:** పొలసానిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆంజనేయ నగరం ఆవాస ప్రాంతంలో దశాబ్దాల కాలంగా నెలకొని ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామానికి శివారు ప్రాంతంలో గల ఆంజనేయ నగరం ఆవాసప్రాంతానికి పంచాయితీ బోరు ద్వారా వచ్చే తాగునీరే ఆధారం. వ్యవసాయ క్షేత్రాల మధ్యలో గల ఈ ఆవాస ప్రాంతానికి బోరు నీటి సరఫరాకు అవసరమైన విద్యుత్ సరఫరా కనెక్షన్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌గా నమోదయింది. దీనితో ఏడు గంటల మాత్రమే బోరు పనిచేసే అవకాశం ఉండేది. అది కూడా గ్రామస్థులకు అనువైన సమయంలో కాక ఇతర సమయాల్లో పనిచేయ డంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడేవారు.దీనితో గ్రామస్తులు తమ సమస్యను గ్రామ సర్పంచ్ షేక్ రహీమా బేగం హసేన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన సర్పంచ్ ఆ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు విద్యుత్ కనెక్షన్ 24 గంటలు విద్యుత్ సరఫరా జరిపే పారిశ్రామిక ఫీడర్‌తో అనుసంధానంతో పాటు, అదనంగా అక్కడ ట్రాన్స్ఫ ర్మర్ బిగించవలసిన అవసరం ఉందని గుర్తించారు. సమస్య పరిష్కారానికి ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు సహకారం కోరారు. దీనిపై స్పందించిన శాసనసభ్యులు ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి బోరు విద్యుత్ కనెక్షన్‌ను పారిశ్రామిక విద్యుత్ ఫీడర్‌తో అనుసంధానం చేయటం, అవసరమైన అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యేలా కృషి చేశారు.ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ శనివారం ప్రారంభించారు.ఆంజనేయ నగరం ఆవాస ప్రాంతంలో గల 8,9వవార్డుల ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్,శాసనసభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చెయ్యాలి




**కుక్కునూరు,మేజర్ న్యూస్:** అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రాత్రికి రాత్రే రద్దు చేయడం, వాటి స్థానంలో లేబర్ కోడ్ లు తీసుకురావడం చాలా దుర్మార్గం అని అని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ విమర్శించారు. సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా లేబర్ కోడ్‌లు అమలు చేయడం నిరసిస్తూ కుక్కునూరు మెయిన్ సెంటర్లో నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడు తూ బ్రిటిష్ కాలంలోనే కార్మికవర్గం పోరాడి కార్మిక హక్కులు సాధించుకున్నదని అన్నారు. స్వాతంత్రం అనంతరం అనేక పోరాటాలు నిర్వహించి సాధించుకున్న హక్కులను, నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్ లు అమలు చేయడం అంటే కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టడమేనని విమర్శించారు. తక్షణమే లేబర్ కోడ్లను రద్దుచేసి, రద్దుచేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు నాయకులు తిరోజుల సురేష్, కార్మికులు నెర్రబోయిన సాయిరాం,సోడే వెంకటేష్,కడారి తిరపతయ్య, ముత్తేష్, నాగరాజు,జోగరావు,గరటం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాసా కిట్లు బహూకరణ



**కైకలూరు, మేజర్ న్యూస్,** స్థానిక కైకలూరు శ్రీ చైతన్య పాఠశాలలో నాసా కాంటెస్ట్లో పాల్గొంటున్న విద్యార్థులకు కైకలూరు పట్టణ సిఐ రామకృష్ణ చేతుల మీదగా కిట్లు బహూకరణ నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ రామకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో మానవుడు మనుగడ స్పేస్ లోనే ఉంటుందని దానికి అనుగుణంగా విద్యార్థులందరూ నడుచుకోవాలని మంచి ప్రాజెక్టు ఎంచుకుంటున్న విద్యార్థులును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సురేంద్ర మాట్లాడుతూ కైకలూరుకి నాసా కిట్లు రావడం చాలా గర్వంగా ఉందని విద్యార్థు లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ఏజీఎం ఎస్ పార్థసారథి ,ఏలూరు రీజినల్ ఇంచార్జ్ సిహెచ్ ఉదయ భాస్కర్ ,ఏలూరు జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, పాఠశాల ఏవో పి దానయ్య ,పాఠశాల డీన్ పీ నరేష్ కుమార్ ,పాఠశాల సి ఇన్చార్జి ఏసుబాబు ,నాసా ఇన్చార్జ్ తాజుద్దీన్, భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు జయలక్ష్మి, పూజిత ,విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం




**ఏలూరు,మేజర్ న్యూస్:** కార్మిక హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్లను అమలు కు సిద్ధపడటాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నకు వ్యతిరేకంగా కార్మిక వర్గం నిరసన తెలిపింది. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పాత బస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాలు నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు కే కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో పోరా టాలు ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చి అమలుకు పూనుకోవటం దుర్మార్గమైన చర్యగావారు అభివర్ణిం చారు.140 సంవత్సరాల క్రితం సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని మారుస్తూ రోజుకి 10 నుండి 14 గంటలు పనిచేసే విధంగా కార్మిక చట్టాలలో మార్పు చేయటం కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక దుశ్చర్యగా వారు పేర్కొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఏ అప్పలరాజు, పుప్పాల కన్నబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, డి లక్ష్మణ మూర్తి,బి జగన్నాథం,బత్తుల చంద్రశేఖర్ (బుజ్జి),డి నాగబాబు, జానకిరామ్, అంకం దుర్గమ్మ, బళ్ళ కనక దుర్గారావు,రమణయ్య,కే సురేష్, యాదగిరి శ్రీను,పి రమణ,సిపిఐ నాయకులు కురెళ్ళ వరప్రసాద్, ఏ లక్ష్మీ ఇందిర, ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

### తూర్పుపాలెం గ్రామస్తులకు త్రాగునీరు అందించాలి




**పోడూరు,మేజర్ న్యూస్:** తూర్పుపాలెం గ్రామస్తులకు త్రాగునీరు అందించాలని సిపిఎం మండల కన్వీనర్ కె వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం తూర్పుపాలెం గ్రామంలో మైక్రో ఫిల్టర్ల ద్వారా స్వచ్ఛమైన త్రాగునీరు గ్రామప్రజలకు అందజేయాలనీ సంతకాల సేకరణ చేసి శనివారం సచివాలయం సెక్రటరీ ఎమ్ చిన సత్యనారా యణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చిన ప్రజలకు త్రాగునీరు అందించడం లేదని వారికీ వివరించారు. త్రాగునీరు లేక ప్రజలు నానా ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. చెరువు నీరు మట్టి మలినాలతో ఉండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమస్యను పై అధికారులకు చెప్పి గ్రామంలో త్రాగునీరు అందించాలని గ్రామస్తులు కోరారు. ఈకార్యక్రమలో శాఖ కార్యదర్శి కంకటాల భాస్కరరావు, పిల్లి ప్రసాద్, మోడీ మోజేష్, గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందిం చారు. సెక్రటరీ స్పందించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు.

### అబ్బిరాజు రాజుపాలెంలో వైసిపి నేతలచే సంతకాల సేకరణ



**యలమంచిలి,మేజర్ న్యూస్ :** ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పద్ధతి ద్వారా అమలు చేసే కార్యక్రమాన్ని వ్యతిరే కిస్తూవైఎస్ఆర్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా శనివారం మండలంలోని అబ్బిరాజుపాలెం గ్రామంలో ఇంటింటా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకొల్లు నియోజకవర్గ ఇన్చార్జి గుబ్బల శ్రీహరి గోపాలరావు (గోపీ ) రాష్ట్ర కార్యదర్శి యడ్ల తాతాజీ ,మండల అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్ బాబు,ఎంపీపీ ఇను నుకొండ ధనలక్ష్మి రవికుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస రావు,సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు, ఓదూరి భాస్కరరావు, ఎంపీటీసీ శిరిగిరి సునీత, దొరబాబు బోనం బులి వెంకన్న, మండల కార్యదర్శి శిరిగినీడి రామకృష్ణ,గాడి దుర్గాప్రసాద్,పార్టీ అధ్యక్షులు తాడి కాంతారావు,సాయి మణికంఠ,తాళ్ల సూర్యనారాయణ,శిరిగినీడి వెంకటేశ్వరరావు, చిట్టిబాబు, సూర్యనారాయణ బాల పరమేశ్వరరావు గుబ్బల బులి వెంకన్న,తాతారావు రత్నరాజు శ్రీనివాస్ వైవి రావు, శాంతరావు పులి సుబ్రహ్మణ్యం బాబీ శ్రీరామ్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### జంగారెడ్డిగూడెం పట్టణ టిడిపి అధ్యక్షులుగా కొండేటి కిషోర్




**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** చింతలపూడి నియోజకవర్గం లోని మండల పట్టణ టిడిపి అధ్యక్షులను జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు శనివారం అధికారకంగా ప్రకటించారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పార్టీ జరిపిన వివిధ సర్వేల ద్వారా మండల,పట్టణాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులను అధికారికంగా నియమించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. లింగపాలెం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షులుగా గరిమెళ్ళ చలపతిరావు,చింతం కృష్ణమూర్తి యాదవ్, కుక్కల మాధవరావు,జంగారెడ్డిగూడెం, చింతలపూడి పట్టణాల అధ్యక్షులు గా కొండ్రెడ్డి కిషోర్,తాటి అప్పారావు,అధికారికంగా అ నియమిం చినట్లు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు.

# ప్రముఖ వాణిజ్య వేత్త ,కళా, సంఘ సేవకులు గుప్తాకు అభినందన సత్కారం



**ఏలూరు,మేజర్ న్యూస్:** ప్రముఖ సంఘ సేవకులు,శ్రీనివాస హెయిర్ ఇండస్ట్రీస్ అధినేత, ప్రజా సేవకులు,కళాపోషకులు హిందూ యువజన సంఘం మేనేజ్మెంట్ కమిటీ ఉపాధ్యక్షులు కేకే గుప్తా కి ఇటీవల టాప్ ఎక్స్పోర్ట్ అవార్డు ఫ్లెక్స్ కౌన్సిల్ న్యూ ఢిల్లీ అవార్డు ప్రకటించారు. న్యూఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదాన సభలో కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ద్వారా అవార్డు పొందిన సందర్భంలో శనివారం ఏలూరు వై ఎమ్ హెచ్ ఏ హాలులో జరిగిన సమావేశంలో కె కె గుప్తా ని వైఎంహెచ్ఏ సంస్థ తరపున ఘనంగా సత్కరించడం జరిగింది. ఏలూరు నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నో సేవా సంస్థలకు ఇతోధి కంగా సహాయ సహకారాలు అందిస్తూ టాప్ ఎక్స్పోర్ట్ అవార్డును వరుసగా 25 సంవత్సరాలు పాటు కేకే గుప్తా సాధించడం నగరానికి ఎంతో గర్వకారణమని పలువురు సభ్యులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవి సత్యనారాయణ, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులు యిరదల ముద్దుకృష్ణ ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావు,గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ లునాని,ఉపాధ్యక్షులు వేమా కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి సాయితేజ డాక్టర్ గుడిపాటి లలిత శర్మ,కార్యనిర్వాహక కమిటీ సహాయ కార్యదర్శి కే.బి రావు,సభ్యులు బంక ప్రసాద్ డాక్టర్ లంక వెంకటేశ్వర్లు రేవూరి శివశంకర ప్రసాద్ కే శ్రీనివాస్,శలా రాజాబాబు, కొమ్మన కొండబాబు,ఎం.వి రవీంద్ర, పిలగల కొండలరావు ఏ పార్వతీ రామచంద్రన్, కనిగోళ్ల హేమంత్ కుమార్ ,దువ్వి హేమ సుందర్, మారం హనుమంతరావు, పైడి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ భద్రత పై విద్యార్థులకు అవగాహన : ఎస్ఐ శుభ శేఖర్



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** మండల పరిధి నెక్కలం గొల్లగూడెం చుక్కపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్ఐ శుభ శేఖర్ ఆధ్వర్యంలో మహిళ భద్రత, పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్ డయల్ 112 అనే అంశాలపై విద్యార్థిని,విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ విద్యార్థిని,విద్యార్థులతో మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపై జరుగు నేరాలను, నేరగాళ్లను అదుపులోనికి తీసుకురావాలని ముఖ్య ఉద్దేశంతో ఈ అభయ మహిళా భద్రతను జిల్లా ఎస్పీ ప్రవేశపెట్టినట్లు, మహిళా పోలీస్ సిబ్బందితో శక్తి బీట్లను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసినారని అన్నారు.ఎవరైనా ఆపద సమయంలో వెను వెంటనే పోలీసు వారి యొక్క సహాయము కొరకు డయల్ 112 కు ఫోను ద్వారా సమాచారం అందించిన పది నిమిషాలలో పోలీసులు మీకు భద్రతను ఏర్పాటు చేస్తారని, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామనితెలిపారు.బాల్య వివాహాలకు ఎవరైనా పూనుకుంటే వెను వెంటనే 1098 కు సమాచారం అందించాలని కోరారు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 కి సమాచారం అందించిన వెంటనే సహాయ సహకారాలు అందిస్తారని విద్యార్థిని విద్యార్థులకు పలు అంశాలలో అవగాహనను కల్పించాలని ఎస్ ఐ పేర్కొన్నారు.

## పేదలకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం ,మేజర్ న్యూస్ :** ఏ ఒక్క ప్రభుత్వం చేయలేని విధంగా ఈ ఒక్క సంవత్సరంలోనే మూడు కోట్ల రూపాయలను పేద ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించినట్లు రాష్ట్ర విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. క్యాంపు కార్యాలయము నందు శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి తాడేపల్లిగూడెం నియోజకవర్గంకు చెందిన మొత్తం 47 మంది లబ్ధిదారులకు 19 లక్షల 9 వేల 139 రూపాయలు మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేసారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఐదు సంవత్సరాలలో చేయనటువంటి విధంగా కూటమి ప్రభుత్వం ఒక్క సంవత్సరంలోనే మూడు కోట్ల రూపాయలకు మించి పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో అందించామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారుర్దులు పేర్లను తొలగించుట జరిగిందని వారు తెలిపారు. ఈగ్రామ సభలో ప్రజా ప్రతినిధులు, ఉపాధి శ్రామికులు, మేట్లు పాల్గొన్నారు.

# తడిచేత్త ,పొడిచేత్త వేరుచేసే బాధ్యత మహిళలదే



**పాలకోడేరు,మేజర్ న్యూస్:** మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏది లేదంటూ గ్రామాల్లో పారిశుధ్యంలో బాగంగా తడిచేత్త పొడిచేత్తను వేరుచేసి బాధ్యత ఒక్క మహిళలకే ఉందని ఎమ్పిడిఓవి రెడ్డియ్య అన్నారు.ఆర్జిఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక ననుసరించి క్లీన్ అండ్ గ్రీన్ థీమ్ 5లో భాగంగా పాలకోడేరు మండలంలో ఎన్నికైన వేంద్ర అగ్రహారం గ్రామంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు,పారిశుధ్య సిబ్బందికి మండల పరిషత్ అధికారులు శిక్షణ ఇచ్చారు.

గత 3రోజులు నుండి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు ఉపసర్పంచులకు కార్యదర్శులకు డోక్రా వివోఏలకు గ్రూప్ సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సూర్య విలేఖరి తో మాట్లాడుతూ మండలం లోని అన్ని గ్రామాల లోనూ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు నిర్వహించాల్సిందే నన్నారు.అయితే మేజర్ పంచాయతీ గ్రామాలైన శృంగవృక్షం పెన్నడ మోగల్లు గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేవన్నారు.

రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని సర్వే చేసి తమకు అప్పగించాల్సి ఉందన్నారు.

కాగా గ్రామాల్లోని పెద్దలు, రాజకీయ నాయకులు అడ్డుకుంటున్నారని ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు సహకరిస్తే పనులు పూర్తి అవుతాయని ఎంపిడిఓ అన్నారు.

## పాండిచ్చేరి 'వర్సిటీ 'కోర్టు సభ్యునిగా ఏపీ నిట్ ఆచార్యులు డా.రవి కిరణ్



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని మెకానికల్ ఇంజి నీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యులు డాక్టర్ జి.రవి కిరణ శాస్త్రి పాండిచ్చేరి విశ్వవిద్యాలయం కోర్టు సభ్యునిగా నియమితుల య్యారు.ఈ మేరకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, విశ్వవిద్యాలయ సందర్శకులు నామినేట్ చేశారు. డాక్టర్ రవి కిరణ్ శాస్త్రి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా డీన్ ఆకడమిక్స్గా సమర్థవంతమైన సేవలను అందించారు. ప్రస్తుతం డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీగా, ఏఎన్ఆర్ఎఫ్ కో ఆర్డినేటర్గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముకు, కేంద్ర విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్కు రవికిరణ్ శాస్త్రి తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్,డాక్టర్ ఎన్.వి.రమణారావు,రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి,డీన్ డాక్టర్ వి.సందీప్,డాక్టర్ ఎన్. జయరామ్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ వీరేశ్ కుమార్, డాక్టర్ హిమ బిందుతోపాటు పలువురు విభాగాధిపతులు ఆచార్యులు డాక్టర్ రవి కిరణ్ శాస్త్రికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**పెనుగొండ ,మేజర్ న్యూస్:** పెనుగొండ తేతలి వారి వీధిలో గల ఆధ్యాత్మిక సంస్థ ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓంశాంతి వారిఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కె.సత్యనారాయణ 90 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి వివిధ రకముల అనారోగ్య సమస్యలకు ఉచితముగా మందులు అందజేసారని బ్రాంచి నిర్వాహకులు బికె మణి,బి కెఉష,ప్రసాద్ తెలియచేసారు. ప్రతి నెలలో మూడవ బుధవారంజరిగే ఈసదవకాసాన్నిప్రజలందరూ ఉపయోగించకోవలసినదిగా వారు కోరారు.ఇంకా ఈ ఉచిత హోమియోపతి వైద్య శిబిరంలో రోగులు,ఇతర సిబ్బంది భవాని, వాణి, రమావతి,అరుణ,తులసి పాల్గొన్నారు.

## చిత్రలేఖనంలో హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు బంగారు పతకాలు



**కామవరపుకోట ,మేజర్న్యూస్:** చిత్రలేఖనంలో స్థానిక కామవరపుకోట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు బంగారు పతకాలు లభించాయి. ఒంగోలు సృష్టి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ చిల్డ్రన్స్ యూత్ డ్రాయింగ్ కాంపిటీషన్లో తమ స్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలు లభించినట్లు హెచ్ఎం డీవీఎస్. గవర్రాజు తెలిపారు.ఎం.మీనాక్షి ( 9వ తరగతి), కె.లాస్య ( 8వ తరగతి)కి బాల చిత్రకళా అవార్డులు లభించాయి. అలాగే పోటీలలో పాల్గొన్న ఎం. యశ్వంత్ రామిరెడ్డి ( 7వ తరగతి), జి. అర్చన, బి.ధన రాజేశ్వరి (8వ తరగతి), బి.శాంతకుమారి (10వ తరగతి) కి మెరిట్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. విద్యార్థులను ఎంతో ప్రోత్సహించిన చిత్రకళ ఉపాధ్యాయులు ఎండి. ఇర్షాద్ అహ్మద్కు చిత్రగురు అవార్డు ప్రధానం చేశారు. అవార్డులు సాధించిన విద్యార్థులు, చిత్రకళ ఉపాధ్యాయులను హెచ్ఎం డీవీఎస్. గవర్రాజుతో పాటు వీఎస్ఆర్. మూర్తి, పాఠశాల సిబ్బంది సెక్రటరీ ఎన్.సత్యనారాయణ,జె.మోహన్రావు, శివకిషోర్, సుశీల, శ్యామల మరియు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది,స్కూల్ కమిటీ మేనేజ్మెంట్ వారు అభినందించారు.

# 10వ తరగతిలో రాష్ట్రంలోనే ఏలూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలవాలి







**– విజయకేతనం పుస్తకం పంపిణీలో జడ్పి చైర్ పర్సన్ పద్మశ్రీ,ఎమ్మెల్యే బడేటి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో శనివారం పదవతరగతి స్టడీమెటీరియల్ విజయకేతనం 3.0 పుస్తక మహోత్సవంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటాపద్మశ్రీ,ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సంయుక్తంగా పాల్గొని,విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో నిరుపేద విద్యార్థులకు విద్యా ప్రమాణాలను మెరుగు పరచడం లక్ష్యంగా విజయకేతనం 3.0 పుస్తకాలు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా రూపొందించ పడ్డాయని తెలిపారు. గత సంవత్సరం ఈ పుస్తకాలు వలన పదవతరగతి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఈ సంవత్సరం కూడా అదే స్థాయిలో విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సంవత్సరం జిల్లా పరిషత్తు నిధులతో 30,327 పుస్తకాలు పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావిధానంలో అనేక మార్పులు తీసుకువచ్చారని, ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలని అన్నారు. ఏకాగ్రతతో చదివి విద్యార్థులు ఉన్నతశిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులకు పదవతరగతి ఉత్తీర్ణత ఎంతో కీలకమైనదని, తదుపరి తరగతులలో ప్రవేశించి మంచి భవిష్యత్తును పొందాలంటే ఎంతో ముఖ్యమన్నారు.నూరు శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు.ఈ సమావేశంలో ఉడా చైర్ పర్సన్ పెద్దిబోయిన వాణి వెంకట శివప్రసాదు,మండల పరిషత్తు అధ్యక్షులు పెన్మెత్స శ్రీనివాస రాజు,బిసి నాయకులు ఘంటా ప్రసాదరావు, జిల్లా పరిషత్తు సిఇవో యం.శ్రీహరి, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా పరిషత్తు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు హాజరయ్యారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై ఏలూరు జనసేన సమాయత్తం




**ఏలూరు, మేజర్ న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన శ్రేణులు దృష్టి సారించాలని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు సూచించారు.స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయిలో సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయాన్ని సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ఏలూరులోని 50 డివిజన్ లలోను కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాల్సిందిగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఇప్పటికే పలు డివిజన్ కమిటీలను ఏర్పాటు చేశామని, డివిజన్ కమిటీల నియామకంతో బూత్ స్థాయిలో పార్టీ బలం పెరిగిందని, ఏలూరులో త్వరలోనే నగర కమిటీతో సహా పలు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నగర అధ్యక్షులు వీరంకి పండు, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, కార్యదర్శి ఎట్రించి ధర్మేంద్ర, బొత్స మధు, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, బుద్ధా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి





**– రోగులకు పరామర్శ ఆరోగ్యం కాపాడుకోవాలని హితవు**

**పాలకొల్లు, మేజర్ న్యూస్ :** పేదలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంగా ప్రభుత్వ వైద్యాధికారులు పనిచేయాలని,అప్పుడే పేదవారికి ఆరోగ్య భద్రత చేకూరుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారులి.శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాలకొల్లు ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంలో ప్రసూతి వార్డు, పురుషుల వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. పిల్లలు కొట్లాట కారణంగా కంటికి దెబ్బ తగిలిన తత్తరమూడి మనోజ్ ను పలకరించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అలాగే పురుషుల వార్డు సందర్శించిన సందర్భంలో ఆల్కహాల్ కు బానిసైన వ్యక్తికి మంచి మాటలతో హితవు పలికారు.భార్యాభర్తల గొడవలు కారణంగా ఆసుపత్రిపాలైన వ్యక్తికి ధైర్యం చెప్పారు. ఎప్పుడు ధైర్యాన్ని కోల్పోకూడదని, ఇష్టదైవాన్ని స్మరించుకుంటూ జీవితాన్ని ముందుకు కొనసాగించాలని, అప్పుడే త్వరగా కోల్కోగలుగుతామన్నారు. ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న మహిళలతో మాట్లాడి ఆరోగ్య వివరాల ను అడిగి తెలుసుకున్నారు. వైద్యం సక్రమం గా జరుగుతుందా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా ఆరా తీశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్త ఆసుపత్రి అంతా కలియతిరిగి అన్ని విభాగాలను పరిశీలించారు. ఎక్కడైనా లీకేజీలు వచ్చాయా, చెమ్మచెరుతుందా అంతా పరికించి చూశారు.

సిబ్బంది ఎంతమంది ఉన్నారు, డాక్టర్ల కొరత ఏమైనా ఉందా, ప్రతినెల ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి అనే విషయాలను ఆస్పటల్ సూపరింటెండెంట్ అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సందర్శన సందర్భంలో డి.సి.హెచ్.ఎస్ పి.సూర్య నారాయణ, హాస్పిటల్ సూపరింటెండెంట్ మాధురి, ఆర్ ఎం ఓ జనార్దన్ బాబు, తహసిల్దార్ వై.దుర్గా కిషోర్, మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంది

**– జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలా వసంతరావు**



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలా వసంతరావు తెలిపారు. శుక్రవారం నరసాపురంలో అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సభ విజయవంతం అనంతరం ఆయన సూర్య ప్రతినిధితో ముచ్చటించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకుంటున్నది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో వేలాది మంది మత్స్యకారులు ఈ సభకు వచ్చి విజయవంతం చేశారన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలపై మత్స్యకార వర్గంలో నమ్మకం ఏర్పడిందని, అధికారంలోకి వచ్చిన నాటి నుండి మత్స్యకారుల పట్ల ప్రభుత్వం అలంబిస్తున్న తీరు ఆశాజనకంగా ఉండటంతో వేల మంది ఈ సభకు వచ్చి విజయవంతం చేశారన్నారు. డీజిల్ సబ్సిడీ, వేట విరామ సమయంలో పరిహారం, ఇటీవల సంభవించిన మంద తుఫాన్ తదితర విషయాలలో ప్రభుత్వ తీరు ఆశాజనకంగా ఉన్నది అన్నారు. తుఫాను రాకముందే పర్యావరణ శాఖ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం యంత్రాంగాన్ని తీర ప్రాంతానికి పంపించటం, ముందుగానే పునరావాస కేంద్రాలు ఏర్పాటుతోపాటు, ప్రజలను అక్కడికి తరలించటం తుఫాను 50 కేజీల బియ్యంతో పాటు నిత్యవసరాలు అందజేసి నివాసాలకు పంపించారని ఆయన అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా హాజరైన కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పొత్తూరి రామరాజు, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ ఇతర అతిధులకు వసంతరావు ధన్యవాదములు తెలిపారు.

## మానవత ఆధ్వర్యంలో 10 విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న మానవతా స్వచ్ఛంద సంస్థ మండల స్థాయి శాఖల ఆధ్వర్యంలో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంలు నిర్వహించాలని సంస్థ జిల్లా ప్రతినిధి, విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణ మూర్తి శనివారం ఇక్కడ తెలిపారు. ఈ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం సంబంధించి ప్రతి మండల శాఖకు జిల్లా కమిటీచే స్పాన్సర్ చేయబడిన రెండు విద్యాసంస్థలకు ప్రోత్సాహక బహుమతులను పంపించడం జరిగిందని ఆయన అన్నారు.

ఈ నెల 20తో పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు ముగిసినందున ప్రతి మండల శాఖ వారు రెండు విద్యాసంస్థలలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించాలని అన్నారు.

ఈ ప్రోగ్రాము్లు నిర్వహించడానికి సంస్థ శాఖ లోని కెరియర్ గైడెన్స్ కమిటీలో ఉన్న వారిని గాని, లేదా అందుబాటులో ఉన్న విద్యా రంగ ప్రతినిధులను రిసోర్స్ పర్సన్స్‌గా ఆహ్వానించి డిసెంబర్ 15 తేదీ నాటికి కార్యక్రమాన్ని పూర్తి చేయవలసిందిగా ఆయన కోరారు.ఈ విషయంలో పిల్లలకు అవగాహన కలిగించడంలో ప్రత్యేకమైన శ్రద్ధ వహించి సాధ్యమైనంత వరకు ఎక్కువ విద్యాసంస్థలలో ఈ ప్రోగ్రామ్ జరపాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ కోడూరి పుష్పావతి ఆదేశాలు ప్రకారం సకాలంలో నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.